# రిస్క్

పాణంగి పల్లి నాగభూషణం



**• "ఈ పని ఈ రోజు అయిపోవాలి! అర్జెంటు! త్వరగా ఫైలుమీద నోట్ రాసి పట్టుకురండి!" ఫైలు శరత్ ముందుకు తోస్తూ అన్నాడు మేనేజరు అన్నాడు.**

**'తొందరపడి ఫైలు సరిగా స్టడీ చేయకుండా నోట్ రాస్తే తప్పులు దొర్లుతాయి. రిస్క్!' నిర్ద్వంద్వంగా త్వరగా ఫైలు తయారుచెయ్యి అన్న మేనేజర్ కోరికను తిరస్కరించాడు శరత్.**

రోజుకి ఓ వందసార్లయినా రిస్క్ అన్న మాట శరత్ నోట వినడం అలవాటైన మేనేజర్ నోట మాట రాలేదు. శరత్ సిన్సియర్, చాలా హార్డ్ వర్కర్. అందుకే ఏమీ అనలేకపోయాడు. "ఓకే! ఓకే! టేక్ యువర్ ఓన్ టైమ్! యు కెన్ గో!" అన్నాడు మానేజరు.

శరత్ ఫైలు ముందు వేసుకుని దానిలో మునిగిపోయాడు.

రాత్రి తొమ్మిదయింది. ఇంకా శరత్ ఇంటికి రాలేదు. భార్య పద్మ అటూ ఇటూ అసహనంగా తిరుగుతోంది. పిల్లలిద్దరికీ అన్నం పెట్టి పడుకోబెట్టింది. తొమ్మిదిన్నరకి ఇంటికి వచ్చాడు శరత్.

"ఏం, ఇంత ఆలస్యం అయింది? ఆఫీసులో పని ఎక్కువగా ఉందా?" అడిగింది పద్మ.

"సాయంత్రం సిటీ బస్సులు చాలా రష్‌గా ఉంటాయి. మన పర్సుని ఎవరైనా కొట్టేయచ్చు. పరుగెత్తి బస్సు ఎక్కబోతే రాడ్ చేతికి దొరక్క జారి కిందపడిపోవచ్చు. చాలా రిస్క్! అందుకే ఎనిమిది దాకా ఆఫీసులో ఉండి వస్తున్నాను!"

తల పట్టుకుంది పద్మ. భర్త ప్రతిదానికీ రిస్క్ అంటాడు. ఈయనతో వేగడం కష్టం అయిపోతోంది.

నిద్రపోతున్న పిల్లల్ని పరీక్షగా చూశాడు శరత్. బట్టలు కొద్దిగా మాసి ఉన్నాయి. "మళ్లీ పిల్లల్ని మట్టిలో ఆడనిచ్చావా? ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. రిస్క్ అంటే వినిపించుకోవేం?" చికాగ్గా అన్నాడు శరత్ బట్టలు మార్చుకుంటూ.

వంట చల్లారిపోయింది. మళ్లీ వేడిచేయబోయింది పద్మ.

"వద్దు! వండిన పదార్థాలను తిరిగి వేడి చేయకు! కార్సినోజన్స్ డెవలప్ అవుతాయి. అవి తింటే కాన్సర్ వస్తుంది. ఆరోగ్యానికి రిస్క్! పుస్తకంలో చదివాను!" అన్నాడు శరత్.

పద్మ భోజనం చేస్తూ ఆలోచనల్లో పడిపోయింది. భర్త ప్రతిదానికీ రిస్క్ అనడం ఎక్కువైపోయింది. ఈ ఉదయం తన ఫ్రెండ్ రమ చెప్పిన సలహా గుర్తుకు వచ్చింది.

"మీ ఆయన రిస్క్ రిస్క్ అంటాడని ఊరికే హస్క్ కొట్టక, మీ అన్నయ్య సాయం తీసుకో అంది!"

ఆ సలహా ఆ రాత్రే అమలుపరిచింది.

చెల్లెలు పద్మ రాసిన ఉత్తరం చూసి ఆఘమేఘాలమీద చెల్లెలింటికి వచ్చాడు పద్మ అన్నయ్య చైతన్య.

"మీ బావగారు ప్రతిదానికీ రిస్క్ అంటారు. అది నీకు తెలిసిందే! కానీ ఈమధ్య ఈ పిచ్చి

మరీ ఎక్కువైపోయింది. ఏదో ఉపాయం ఆలోచించి ఆయనచేత ప్రతిదానికీ రిస్క్ అనడం మానిపించాలి!" అన్నగార్ని పిలిపించిన పని చెప్పింది పద్మ.

"బావగారు ఎప్పుడూ తన పనేదో అదే చూసుకోడానికి అలవాటు పడిపోయారు. ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లి బయట ప్రపంచం చూడలేదు. ఇతరుల జీవితంలో కూడా ఇంతకన్నా ఎక్కువ రిస్క్ ఉంటుందని, రిస్క్ అనేది తనకి ఒక్కడికే ఉండేది కాదని తెలిస్తే బావగారి అలవాటు అదే పోతుంది. పది రోజులు బావగారిని మన ఊరికి తీసుకువెళ్లి, నాలుగూ చూపించి తీసుకువస్తాను. అప్పుడు బావగారు ఇతరుల జీవితంలో రిస్క్‌ని గమనించి, తన అలవాటుని మార్చుకోవచ్చు. ఏమంటావు?" అడిగాడు చైతన్య చెల్లెల్ని.

"అలాగే! నీకు ఏది మంచిదనిపిస్తే అది చెయ్యి, అన్నయ్యా!" అంది పద్మ.

* * *

కోనసీమలో కొబ్బరి తోటల మధ్య నడుస్తూ బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయాడు శరత్. సూర్యుడు కొబ్బరి ఆకులు చీల్చుకుని వెలుగును భూమిమీద ప్రసరించడానికి, తన ఉనికిని చాటుకోవడానికి చాలా శ్రమపడుతున్నాడు. గాలికి మందంగా ఊగుతున్న కొబ్బరి ఆకులు ఎండతో దోబూచులాడుతుంటే చిత్రంగా నీడలు నేలమీద కదులుతున్నాయి.

బాగా తలెత్తి నిటారుగా చూస్తే కానీ దట్టంగా పరుచుకున్న కొబ్బరి ఆకుల నడుమ ఉన్న ఆకాశం కనపడటంలేదు. ఆకాశానికి ఎవరో ఆకుపచ్చని తెర కప్పినట్లుంది. మహారాజుకి అడుగడుగునా పచ్చటి గొడుగు పట్టినట్లు, ప్రకృతిలో కొబ్బరి చెట్లు గొడుగుల్లా భాసిల్లి ఎండ తగలనీయకుండా, అమితమైన ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

ఆకుల మధ్య కొబ్బరి గెలలు నిండుగా, భారంగా వేలాడుతున్నాయి. పన్నకే ఉన్న తెల్లటి కొబ్బరి పూలు వింజామరలు వీస్తూ సేవలు చేస్తున్నాయి. ప్రకృతి కాంత ఆకుపచ్చని చారల చీర కట్టుకున్నట్టుగా ఉంది.

"బావా! మన తోటకి వచ్చేశాం, ఆగు!" అంటూ అక్కడ ఉన్న మనిషిని పిలిచి బోండాలు దించమని పురమాయించాడు చైతన్య.

ఆ వ్యక్తి కాళ్లకి బంధం, నడుముకి బెల్టు కట్టుకుని చకచకా బొడ్లో కత్తితో కొబ్బరి చెట్టు ఎక్కుతుంటే ఆశ్చర్యంగా చూశాడు శరత్. టపటపా ఓ అరడజను బోండాలు నేలమీద పడ్డాయి. చెట్టెక్కిన మనిషి దిగి వచ్చి కత్తితో కొబ్బరి కాయల్ని చెరుగుతుంటే, శరత్, చైతన్య కడుపులు పట్టినన్ని బోండాలు తనివితీరా తాగారు.

గబగబా కొబ్బరిచెట్టు ఎక్కి కాయల్ని అవలీలగా దించిన వ్యక్తిని అడ్మైరింగ్‌గా చూస్తున్నాడు శరత్.

"ఇదే ఇతని జీవనాధారం. ఇలా రోజూ యాభై, అరవై చెట్ల కొబ్బరికాయలు దింపుతాడు. చెట్టుకి ఒక కొబ్బరికాయ చొప్పున కూలిస్తారు. ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. మృత్యువే అతని మిత్రుడు. నిజంగా వాళ్ల లైఫ్ చాలా రిస్క్ కదూ, బావా!" అన్నాడు చైతన్య.

"అవునవును!" గిల్టీగా ఫీలవుతూ అన్నాడు శరత్.

మరునాడు అంతర్వేదికి తీసుకువెళ్లాడు




MARKET PULSE 9737 T



## మనీష గొప్పనటి!

అంటున్నాడు అనిల్ కపూర్. " మనీషను 'ప్రేమ్' చిత్రంలో నటించేటప్పుడు తొలిసారిగా చూశాను. ఈ తరువాత 'సౌదాగర్'లో అవకాశం వచ్చింది మనీషకు. అందులోకూడా ఆమె అంతగా నచ్చలేదు. ఎందుకంటే మేకప్పూ, విగ్గులు ఆమె అసలందాన్ని కనబడనివ్వలేదు. '1942-ఏ లవ్ స్టోరీ' చిత్రానికి మాధురీదీక్షిత్, ఆశ్వినీభావే, అనూఅగ్రవాల్, మనీషీకోయిరాలాలకు స్క్రీన్ టెస్ట్ చేశారు. మాధురి తనకా పాత్ర వద్దన్నాక మనీష పేరును నేనే సూచించాను. కాని సెట్లమీద అందరూ అనేవారు 'ఆ అమ్మాయిని అనవసరంగా ఎంపిక చేసుకున్నారు. ఆమె అంత బాగా నటించలేదేమో!' అని. కాని నిజాయితీగా, అంకితభావంతో మనీష నటించడం గమనించాను. మొట్టమొదటి షెడ్యూలులో మనీష నటన చూశాక నిజంగానే ఓ స్టార్ పుట్టిందన్న నమ్మకం కలిగింది నాకు. అప్పట్లో రోజూ కలిసి నటించే సందర్భాలుండటంవల్ల, మా ఇద్దర్నీ గురించీ వదంతులెన్నో చెలరేగాయి. నిజానికి మేము సహోద్యోగులం, అంతే! 'బాంబే' చిత్రంలో అవకాశం వచ్చిందనీ, చాలా తక్కువ పారితోషికం ఇస్తారు కనుక వద్దందామనుకుంటున్నాననీ నాతో చెప్పింది మనీష. మణిరత్నం లాంటి దర్శకుడి దగ్గర ఊరికే పనిచేయటం కూడా మేలేనని నేనే ఒప్పించాను మనీషను. 'బాంబే' తరువాత మనీషకెంత పేరొచ్చిందో అందరికీ తెలుసు. 'దిల్ సే...' చిత్రంలో మనీష నటన చూసి విస్మితుడినయ్యాను. మా మధ్య ఎవరో గొడవలు రేపారుగాని అన్నీ సద్దుకున్నాయి. ఇప్పుడు మేమిద్దరం కలిసి బోనీకపూర్ తీసే ఓ చిత్రంలో నటించబోతున్నాం" అంటున్నాడు అనిల్ కపూర్. అయినా ఎప్పటి సంగతులో ఇప్పుడు తలుచుకోవటం ఎందుకుట? వింటున్నావా మనీషా?

బావగార్ని చైతన్య. లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని సముద్రం ఒడ్డుకి వెళ్లారు ఇద్దరూ.

అప్పుడే వేటనుంచి తిరిగి వచ్చిన జాలర్ల బుట్టల్లో ఇంకా కొన ఊపిరితో గిలగిలా కొట్టుకుంటున్న చేపల్ని జాలిగా చూస్తున్నాడు శరత్.

"జాలర్ల జీవితం దినదినగండం నూరేళ్ల ఆయుష్షులాంటిది కదూ! వాళ్లు పొట్టకూటికి ఎవరూ తీసుకోనంత రిస్క్ తీసుకుంటారు కదూ!" అన్నాడు చైతన్య.

చురచురా చూశాడు శరత్ బావమరిదివంక.

తెలుసున్న వాళ్లు హాస్పిటల్లో జాయినయ్యారంటే ఓసారి పలకరించి వద్దామని శరత్, చైతన్యలు హాస్పిటల్‌కి వెళ్లారు. వార్డులో నడుస్తుండగా, ప్రసవ వేదన పడుతున్న స్త్రీ కనిపించింది. బంధుజనం, ఆమెను స్ట్రెచర్‌మీద పడుకోబెట్టుకుని లేబరు రూమ్‌కి తీసుకెళ్తున్నారు. ఆ స్త్రీ బాధని వర్ణించడానికి మాటలు చాలవు. అటూ ఇటూ బాధతో విలవిల్లాడిపోతూ కదిలిపోతున్న ఆమెను స్ట్రెచర్‌మీద కదలకుండా ఉంచడానికి నలుగురు మనుషులు చాలటంలేదు. దిగులుగా అటే చూస్తున్నాడు శరత్.

"మరో ప్రాణికి జన్మను ప్రసాదించడంలో స్త్రీకి నిజంగా ఎంత రిస్క్? అందుకే ఆడదానికి పురుడు పునర్జన్మ అన్నారు!" అన్నాడు చైతన్య.

నిర్వికారంగా చూశాడు శరత్, చైతన్య కళ్లల్లోకి.

శరత్ పేపర్లో మునిగిపోయాడు. ఆంధ్రదేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అందరికీ ఉత్కంఠతనూ, ఉత్సుకతనూ కలిగిస్తున్నాయి. డైలీ పేపర్ల అమ్మకాలు అమాంతం పెరిగాయి.

"చూశావా, బావా! అంత పెద్దపెద్ద పదవుల్లో ఉన్నవాళ్లకి కూడా నిజంగా ఎంత రిస్కో!" అన్నాడు చైతన్య.

బావమరిదికేసి తినేసేటట్లు చూశాడు శరత్.

పనిమనిషి సరిగ్గా పని చేయట్లేదని గొడవపడి దాన్ని పనిలోంచి మానిపించింది చైతన్య భార్య. ఆ సంగతిని నిశితంగా, ఇంటరెస్ట్‌గా చూస్తున్న బావగారితో అన్నాడు చైతన్య - "వాళ్ల పని చూడు, ఎంత జాలి వేస్తుందో! ఈరోజు ఇక్కడ, రేపు ఎక్కడో? ఎంతో రిస్క్‌తో కూడుకుంది కదా వాళ్ల బడుగు జీవితం!" అక్కడనుంచి సీరియస్‌గా వెళ్లిపోయాడు శరత్.

ఓ వారం పదిరోజులు ఉంటాడనుకున్న బావగారు నాలుగోరోజే తిరిగి వెళ్లిపోతానంటే బస్సెక్కించడానికి బస్టాండుకి వచ్చాడు చైతన్య.

బస్టాండ్ అంతా కిక్కిరిసిన జనంతో కిటకిటలాడుతూ, పెరిగిపోతున్న దేశ జనాభాని కళ్లముందు నిలిపింది. 'పాప్‌డీ' పొట్లాల్ని ట్రేలో పెట్టుకుని పదేళ్ల కుర్రాడు అప్పుడే స్టాండ్‌లోకి వచ్చిన బస్సులో "పాప్‌డీ!..పాప్‌డీ!" అనుకుంటూ దూసుకువెళ్లాడు.

ఎదురుగా వచ్చే భారీ శాల్తీని తప్పించుకునే వీలులేక గుద్దుకుని కిందపడ్డాడు. పాప్‌డీ పొట్లాలు అన్నీ చెల్లాచెదురుగా రోడ్డుమీద పడ్డాయి. ఆ కుర్రాడు గబగబా తనకి తగిలిన దెబ్బల్ని సైతం మరిచిపోయి, కంగారుగా పొట్లాలు ఏరుకుంటుంటే చూసిన అందరికీ పాపం అనిపించింది.

"హాయిగా స్కూల్‌కి వెళ్లి ఆడుతూ పాడుతూ చదువుకునే ఈ లేత వయసులో బతుకు బరువైన ఆ కుర్రాడి పాట్లు చూశావా, బావా! ఇంత చిన్న వయసు నుండి వాడి జీవితంలో ఎంతటి రిస్క్?" సీరియస్‌గా అన్నాడు చైతన్య.

ఏదో అందామని నోటిదాకా వచ్చి ఆగిపోయాడు శరత్. ఈలోగా హైదరాబాదు బస్సు వచ్చింది. తను రిజర్వ్ చేసుకున్న సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు శరత్.

"ఇంత రిస్క్ ఎందుకు తీసుకున్నావు, బావా?" బస్సు కదులుతుండగా శరత్ అన్న మాటలకి కుదేలైపోయాడు చైతన్య. 'నైజ గుణానికి, గుడ్డి కంటికి మందు లేదు!' అని అస్తమానూ గొణుక్కునే బామ్మ మాటలు గుర్తుకు వచ్చాయి. బావగారి అలవాటు మార్చడం ఆ దేవుడి తరం కూడా కాదు! నిరాశగా ఇంటికి మళ్లాడు చైతన్య.

వారం తిరక్కుండా చెల్లెలి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూసిన చైతన్యకి, ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారిగా కలిగాయి.

'నువ్వు ఏం మంత్రం వేశావో కానీ, అన్నయ్యా! ఆయన రిస్క్ అనటం మానేశారు!' అని రాసింది పద్మ ఆ ఉత్తరంలో. 'నువ్వు ఎంతో రిస్క్ తీసుకుని మీ బావగారితో రిస్క్ అనటం మానిపించి, నాకు రిస్క్ తగ్గించావు. నువ్వు తీసుకున్న రిస్క్‌కి థాంక్స్, అన్నయ్యా!' అంటూ ముగించింది చెల్లెలు. ■